క్లుప్తంగా

ఉపాధ్యాయుడికి డాక్టరేట్

ఒంగోలు: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న పి.రమేష్‌బాబుకు ఆచార్య నాగార్జున యూనివర్శిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. చీమకుర్తి మండలం పి.నాయుడుపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో రమేష్‌బాబు ఆంగ్ల ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఈయన 'ఏ స్టడీ ఆఫ్ ది ఎడ్యుకేషనల్ టెక్నాలజీ ఇన్‌పుట్స్ ఇన్ ది బీఈడీ కరిక్యులమ్ ఇన్ ఏపీ' అనే అంశంపై ఏఎన్‌యూలో పరిశోధనా పత్రం సమర్పించారు. నాగార్జున విశ్వవిద్యాలయం పీజీ సెంటర్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ డి.హసన్ గైడ్‌గా వ్యవహరించారు. ఈ సందర్భంగా రమేష్‌కు పలువురు ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

బాధ్యతలు స్వీకరించిన సీఐలు


ఎన్ శ్రీకాంత్, రూరల్ సీఐ


పాండురంగారావు, ట్రాఫిక్ సీఐ

ఒంగోలు టౌన్: ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో పోస్టింగులు దక్కించుకున్న పలువురు సీఐలు బాధ్యతలు స్వీకరించారు. ఒంగోలు రూరల్ సీఐగా ఎన్.శ్రీకాంత్‌బాబు, ట్రాఫిక్ సీఐగా పాండురంగారావు ఆదివారం బాధ్యతలు చేపట్టారు. కాగా రూరల్ సీఐ శ్రీకాంత్‌బాబును మద్దిపాడు, సంతనూతలపాడు, నాగులప్పలపాడు ఎస్సైలు మర్యాదపూర్వకంగా కలిశారు. రూరల్ పరిధిలోని గ్రామాల్లో శాంతిభద్రతల పరిస్థితిపై ఎస్సైలతో సీఐ చర్చించారు. రెండు రోజుల క్రితమే వన్‌టౌన్ సీఐగా నాగరాజు బాధ్యతలు చేపట్టారు.

గుప్తాస్ గోల్డ్ హౌస్ షోరూం ప్రారంభం



షోరూంను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దామచర్ల, ఎంపీ మాగుంట తదితరులు

ఒంగోలు అర్బన్: స్థానిక కర్నూలు రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన గుప్తాస్ గోల్డ్ హౌస్ షోరూంను ఆదివారం స్థానిక ఎమ్మెల్యే దామచర్ల జనార్దనరావు, ఎంపీ మాగుంట శ్రీనివాసరెడ్డి, మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, శిద్దా సూర్యప్రకాష్, శిద్దా హనుమంతరావు తదితరులు ప్రారంభించారు. అనంతరం షోరూంలో ఏర్పాటు చేసిన నూతన డిజైన్లను పరిశీలించారు. అందరికీ అందుబాటు ధరల్లో లేటెస్ట్ డిజైన్లతో బంగారు, వజ్రాభరణాలు ఉంచడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో గుప్తాస్ కుటుంబ సభ్యులు, వీరబాబు, రాజ్‌కుమార్, విజయ్ సారథి తదితరులు పాల్గొన్నారు.

రేపు జిల్లా ఉపాధి కార్యాలయంలో జాబ్‌మేళా

ఒంగోలు టౌన్: ఈ నెల 13వ తేదిన జిల్లా ఉపాధి కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కార్యాలయ అధికారి టి.భరద్వాజ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తారిక మేనేజ్‌మెంట్ సర్వీసెస్, ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంక్, ఆక్సిస్ బ్యాంకు టైమ్స్ ప్రో, ఫ్లిప్‌కార్ట్ కంపెనీలో టెలీకాలర్, బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్, సేల్స్ కాసా, డెలివరీ ఎగ్జిక్యూటివ్ తదితర కంపెనీల్లో వివిధ కేటగిరికీ సంబంధించిన ఖాళీలను భర్తీ చేయడానికి ఇంటర్వ్యూలను నిర్వహించనున్నట్లు వివరించారు. ఐటీఐ, డిప్లమా, టెన్త్, ఇంటర్మీడియెట్, డిగ్రీ, ఆపై చదువులు పూర్తి చేసిన అభ్యర్థులు ఆధార్ కార్డు, ధ్రువీకరణ పత్రాలతో ఇంటర్వ్యూకు హాజరుకావచ్చని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు రూ.12 వేల నుంచి రూ.25 వేల వరకు వేతనంతో పాటు ఆకర్షణీయ ప్రోత్సాహకాలను ఇవ్వనున్నారు. జిల్లాలోని 18 నుంచి 30 సంవత్సరాల లోపు యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేటి నుంచి తొమ్మిదో రౌండ్ వేలం



జి.సునీల్ కుమార్

కొండపి (సింగరాయకొండ): కొండపిలోని స్థానిక పొగాకు బోర్డులో నేటి నుంచి తొమ్మిదో రౌండ్ వేలం ప్రారంభమవుతుందని వేలం నిర్వహణాధికారి జి.సునీల్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు వేలానికి బేళ్లు తీసుకొచ్చేటప్పుడు సాఫ్ట్, హీటెడ్ బేల్స్ లేకుండా చూసుకోవాలని బేలు 150 కేజీల కన్నా ఎక్కువ ఉండకూడదన్నారు. వేలానికి తీసుకొచ్చే బేళ్లను కాటా వేయమని, మార్కెట్‌కు అనుగుణంగా ఉన్న బేళ్లను ముందు రోజు వచ్చి పరిశీలించి తెచ్చుకోవాలని అన్నారు. అధిక ఉత్పత్తికి సంబంధించి పొగాకును ఒక బ్యారన్‌కు 5 బేళ్ల మాత్రమే కొనుగోలు చేస్తారన్నారు.


కూలేందుకు సిద్ధం ఉన్న భవనం


నిరుపయోగంగా ఉన్న బాత్‌రూమ్‌లు, టాయిలెట్స్


వ్యర్థాలతో దుర్వాసన వస్తున్న గది


పగిలిపోయిన విద్యుత్ స్విచ్ బోర్డు

వసతి.. అధోగతి

- ప్రభుత్వ కళాశాల హాస్టల్‌లో వెక్కిరిస్తున్న వసతుల లేమి
- మరుగుదొడ్లకు తలుపులు లేవు
- నీరు లేక విలవిల్లాడుతున్న విద్యార్థులు
- 42 ఫ్యాన్లకుగాను పనిచేస్తున్నది 13 మాత్రమే
- వంట గదిగా ఆర్‌ఓ ప్లాంట్ చాంబర్ శిథిల భవనం తొలగించని వైనం

ఒంగోలు సెంట్రల్:

చదువుకుంటే బతుకు బాగుంటుందని భావించే తల్లిదండ్రులు తమ పిల్లలను ఎన్ని కష్టాలు పడైనా సరే చదివించుకుంటారు. అవసరమైతే అప్పులు చేసి మరీ పిల్లలను ఉన్నత విద్యకు పంపుతారు. ఆర్థిక స్థోమత లేని బడుగు, బలహీనవర్గాలవారు తమ పిల్లలను వసతి గృహాల్లో చేరుస్తారు. అక్కడ సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని, అన్ని వసతులు కల్పిస్తుందని కలలుగంటారు. తమ పిల్లలు చదువుకుంటే కష్టాలు వాటంతట అవే తీరిపోతాయని ఆశపడతారు. కానీ క్షేత్ర స్థాయిలో వసతి గృహాలను పరిశీలిస్తే తీవ్ర మనోవేదనే మిగులుతుంది. ఒంగోలు నగరంలోని అంజయ్య రోడ్‌లో ఉన్న సాంఘిక సంక్షేమ శాఖ ప్రభుత్వ కళాశాల హాస్టల్ వసతుల లేమితో కునారిల్లుతోంది. మౌలిక సదుపాయాలు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఈ వసతి గృహంలో ఇంటర్ నుండి డిగ్రీ వరకు విద్యార్థులు 130 మంది వసతి పొందేందుకు వీలుంది. ప్రస్తుతం 93 మంది విద్యార్థులు ఉంటున్న ఈ హాస్టల్‌లో విద్యుత్ బల్బులు, ఫ్యాన్లు సరిపడినన్ని లేవు. దోమల బెడద అధికంగా ఉండటం, ఫ్యాన్లు లేకపోవడంతో విద్యార్థులు నరక యాతన అనుభవిస్తున్నారు. హాస్టల్లోని 9 గదుల్లో 42 ఫ్యాన్లకుగాను 13 మాత్రమే పనిచేస్తున్నాయి. మరుగుదొడ్ల డోర్లు సైతం పాడైపోయి ఉన్నాయి. నూతనంగా నిర్మించిన మరుగుదొడ్లను వినియోగించకపోవడంతో అవికూడా శిథిల దశకు చేరుకున్నట్లు మారిపోయాయి. అవసరమైన మేర నీటి వసతి కూడా లేదు. చిన్న పాటి ట్యాంక్‌లో నింపే నీరే విద్యార్థులకు దిక్కయింది. ట్యాంక్ పైప్ కూడా ఊడిపోతుండటంతో విద్యార్థులు తిప్పలు పడుతున్నారు. వంట గది సైతం సక్రమంగా లేకపోవటంతో ఆర్‌ఓ ప్లాంట్ గదిలో వంట చేస్తున్నారు. హాస్టల్ ఆవరణలోని పాడుబడిన భవనం తొలగించకపోవడంతో ఎప్పుడు కూలుతుందోనని విద్యార్థులు బిక్కుబిక్కుమంటున్నారు. పాడుబడిన బిల్డింగ్ గదుల్లో మిగిలిన అన్నం, చెత్త వేస్తుండటంతో అవి కుళ్లి దుర్వాసన వస్తోంది. వసతి గృహంలో విద్యుత్ బోర్డులు పగిలిపోయి, స్విచ్‌లు లేక విద్యుత్ వైర్లు అన్ని వేలాడుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి వసతి గృహంలో మౌలికవసతులు మెరుగుపరచాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.



వంట గదిగా ఉపయోగిస్తున్న ఆర్‌ఓ ప్లాంట్ రూమ్

నీటి వసతి మెరుగుపరచాలి



కనిగిరి నియోజకవర్గం నుంచి వచ్చి ఇంటర్మీడియెట్ చదువుతున్నా. నీరు కొంత సమయం మాత్రమే వస్తున్నాయి. చిన్న ట్యాంకులో ఉన్న నీరు అయిపోగానే చాలా ఇబ్బంది పడుతున్నాం. నీటి అవసరాలు తీర్చాలి. మరుగుదొడ్లను బాగుచేయాలి.

– సంతోష్, ఇంటర్ ఫస్ట్ ఇయర్

ఫ్యాన్లు ఏర్పాటు చేయాలి



హాస్టల్ గదుల్లో విద్యార్థులకు సరిపడినన్ని ఫ్యాన్లు ఏర్పాటు చేయాలి. ఇటీవల కొన్ని ఫ్యాన్లు తిరగకపోవడంతో మరమ్మతులు చేశారు. మరిన్ని ఫ్యాన్లు ఉంటే దోమల బారి నుంచి ఇబ్బందులు తప్పుతాయి.

– విజయ్, విద్యార్థి

పాత భవనం కూల్చేయాలి



వసతి గృహ ప్రాంగణంలో పాడుబడిన భవనం ఎప్పుడు కూలుతుందోనని భయమేస్తోంది. ఆ భవనాన్ని తొలగించి, కనీస వసతులు ఏర్పాటు చేయాలని కోరుకుంటున్నాం.

– జి.సంతోష్, ఇంటర్ ద్వితీయ సంవత్సరం


హాస్టల్లో ఫ్యాన్లు తక్కువగా ఉన్న గదులు


ట్యాంక్ వద్ద పైపులను సరిచేస్తున్న విద్యార్థి


శిథిలావస్థలో మరుగుదొడ్లు


సాంఘిక సంక్షేమశాఖ ప్రభుత్వ కళాశాల వసతి గృహం

చిన్నారులను బాధ్యత కలిగిన పౌరులుగా తీర్చిదిద్దాలి

ఒంగోలు టౌన్: చిన్నతనం నుంచి చిన్నారుల్లో దేశభక్తిని పెంపొందించడం ద్వారా బాధ్యత కలిగిన పౌరులుగా తీర్చిదిద్దాలని ప్రకాశం బాలోత్సవం ప్రధాన కార్యదర్శి కె.సుబ్రమణ్యం తలిదండ్రులకు సూచించారు. స్థానిక పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం ప్రకాశం బాలోత్సవం, రోటరీ క్లబ్ సంయుక్తంగా నిర్వహించిన దేశభక్తి గీతాలు, జాతీయ నాయకుల వేషధారణ పోటీల్లో 200 మంది చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వివిధ విభాగాల నుంచి ఐదుగురు చిన్నారులను ఎంపిక చేసి వారికి సర్టిఫికెట్, మెమొంటో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులమతాలకతీతంగా సాటి మనుషులను ప్రేమించేలా పిల్లల్లో సానుకూల దృక్పథాన్ని అలవాటు చేయాలని కోరారు. సామరస్య వాతావరణంలో పెరిగిన చిన్నారులు సమర్థులైన అధికారులుగా, నాయకులుగా రాణిస్తారని చెప్పారు. పిల్లల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసే ఇలాంటి కార్యక్రమాలు ఆత్మస్థైర్యాన్ని పెంపొందిస్తాయని రోటరీ క్లబ్ రీజినల్ చైర్మన్ బందారు లక్ష్మీనారాయణ అన్నారు. పిల్లలకు చిన్నతనం నుంచే ప్రశ్నించడం నేర్పించాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వీరాంజనేయులు సూచించారు. పిల్లలకు చదువుతోపాటుగా కళలు, క్రీడలను కూడా నేర్పిస్తే పరిపూర్ణ విద్యార్థులుగా తయారవుతారని బాలోత్సవం గౌరవాధ్యక్షుడు, ప్రముఖ రచయిత పాటిబండ్ల ఆనందరావు చెప్పారు. ఈ పోటీలకు జడ్జిగా పాటిబండ్ల ఆనందరావు, శేషయ్య, పేతూరు, జ్యోతి, తిమ్మిరి రవీంద్ర, మాధవాచారి వ్యవహరించారు. యూ.భాస్కర్, అబ్దుల్ హై, సురేష్, సుధాకర్, ఆళ్ల రామమూర్తి, తేళ్ల రామచంద్రారెడ్డి, నర్రా సురేంద్ర బాబు, డీఎల్ ప్రసాద్ పాల్గొన్నారు.


పోటీల్లో పాల్గొన్న చిన్నారులతో నిర్వాహకులు

ఘనంగా హెచ్‌ఎం అంజిరెడ్డి పదవీ విరమణ సభ

ఒంగోలు రూరల్: ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి అని, హెచ్‌ఎం టి.అంజిరెడ్డికి రెండు సార్లు ఆ అవకాశం రావడం విశేషమని ఏపీటీఎఫ్ రాష్ట్ర నాయకుడు ఇండ్ల విజయ సారథి పేర్కొన్నారు. ఆదివారం ఒంగోలు రూరల్ మండలంలోని కరవది ఎయిడెడ్ స్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన అంజిరెడ్డి పదవీ విరమణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. స్కూల్ కరస్పాండెంట్ కేఎస్ కరుణాకర్ మాట్లాడుతూ.. అంజిరెడ్డి 36 ఏళ్లపాటు ఎందరో విద్యార్థులను తీర్చిదిద్ది మన్ననలు పొందారని కొనియాడారు. సహోపాధ్యాయులు వైఎస్సార్ టీఎఫ్ జిల్లా నాయకులు జి.వెంటేశ్వరరెడ్డి, జి.రామకృష్ణ, జి.జోన్సహరీఎట్ తదితరులు ప్రసంగించారు. పూర్వ హెచ్‌ఎం జి.బేబీస్టార్ ఘనంగా సన్మానించి బైబిల్ బహూకరించారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా ప్రెసిడెంట్ జనార్దన్ రెడ్డి, రిటైర్డ్ ఎంఈఓ టి.వెంకటరామిరెడ్డి, ఏపీటీజీ ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి, యూటీఫ్ నాయకుడు ప్రసాద్, వైశ్య సంఘం ప్రెసిడెంట్ ఎస్వీ నారాయణ, వెంకటేశ్వరెడ్డి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. జిల్లా నలుమూలల నుంచి హాజరైన 500 ఉపాధ్యాయులకు నిర్వాహకులు విందు ఏర్పాటు చేశారు.


అంజిరెడ్డిని సన్మానిస్తున్న కరెస్పాండంట్ కరుణాకర్, రామకృష్ణ, వెంకటేశ్వర్‌రెడ్డి, జోన్స్ హారిఎట్, ప్రసాద్ తదితరులు

సుబ్బారావు మాస్టర్ సేవలు నిరుపమానం

ఒంగోలు టౌన్: కవిగా, ఉపాధ్యాయుడిగా, సామాజికవేత్తగా జాలాది వెంకట సుబ్బారావు మాస్టర్ చేసిన సేవలు నిరుపమానమైనవని జిల్లా కేంద్ర గ్రంథాలయం ఉప పాలకురాలు బొమ్మల కోటేశ్వరి కొనియాడారు. ఆదివారం జిల్లా గ్రంథాలయంలో ప్రముఖ ఉపాధ్యాయులు సుబ్బారావు మాస్టర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఎంతో నిబద్ధతతో గ్రామీణ నిరుపేద విద్యార్థులను తీర్చిదిద్దిన ఆయన అనేకసార్లు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందారని పేర్కొన్నారు. మూఢ నమ్మకాల నుంచి ప్రజలను విముక్తి చేయడానికి చేపట్టిన ఉద్యమాల్లో ఆయన క్రియాశీల పాత్ర పోషించారన్నారు. ఆయన సేవలను పలువురు వక్తలు గుర్తు చేశారు. అనంతరం ఆజాదీ కా అమృత్ మహోత్సవాన్ని పురస్కరించుకుని పిల్లలతో దేశభక్తి కథలను చదివించారు. అనంతరం పది మంది విద్యార్థులకు గ్రంథాలయ సభ్యత్వం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గోళ్ల ప్రతాప్ కుమార్, సంపూర్ణమ్మ, సున్నా ఆంజనేయులు, అనిల్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


సుబ్బారావు మాస్టర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కోటేశ్వరి, ఉపాధ్యాయులు

వైఎస్సార్ సీపీ నేత పోలయ్యకు ఘన నివాళి

మార్కాపురం రూరల్: మండలంలోని చింతగుంట్ల గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ భర్త పోలయ్య మృతదేహానికి ఆదివారం మార్కాపురం మాజీ ఎమ్మెల్యే, గిద్దలూరు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి కేపీ నాగార్జునరెడ్డి ఘనంగా నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన వెంట ఎంపీపీ బండి లక్ష్మీదేవి కృష్టారెడ్డి, మాజీ ఎంపీపీ ఎల్.మాల కొండయ్య, తర్లుపాడు ఎంపీపీ భూలక్ష్మి రామసుబ్బారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ ఇస్మాయిల్, మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ మల్లికార్జున్, కొండేపల్లి ఎంపీటీసీ సభ్యుడు కుందురు మల్లారెడ్డి, బట్టగిరి తిరుపతిరెడ్డి తదితరులు ఉన్నారు.

ఆర్యవైశ్యులు ఐక్యంగా ముందుకు సాగాలి

- మాజీ మంత్రి శిద్దా రాఘవరావు


శిద్దా, టీజీని సత్కరిస్తున్న ఆర్యవైశ్య సంఘు నాయకులు

ఒంగోలు: ఆర్యవైశ్యులు ఐక్యంగా ముందుకు సాగాలని మాజీ మంత్రి శిద్దా రాఘవరావు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ఎంహెచ్‌ఎస్ కళ్యాణ మండపంలో ప్రకాశం జిల్లా ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీ ప్రమాణస్వీకారానికి శిద్దా రాఘవరావు, మాజీ ఎంపీ టీజీ వెంకటేష్, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు తదితరులు హాజరయ్యారు. నూతనంగా ప్రమాణ స్వీకారం చేసిన ప్రకాశం జిల్లా ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు కోట హనుమంతరావుకు కార్యవర్గానికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు చిన్ని రామసత్యన్నారాయణ, గౌరవ అధ్యక్షుడు పెనుగొండ సుబ్బారాయుడు, వాసవీ సత్ర సముదాయాల అధ్యక్షుడు దేవకి వెంకటేశ్వర్లు తదితరులు శిద్దా రాఘవరావు, టీజీ వెంకటేష్‌తోపాటు ప్రముఖులను సత్కరించారు.

కోట సత్యమాంబదేవికి ప్రత్యేక పూజలు

బేస్తవారిపేట: మండలంలోని గొట్టమిండ్ల సమీపంలోని కోటసత్యమాంబ దేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లెలోని పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోటసత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారిని, సత్యమణికంఠేశ్వరుడిని ప్రత్యేకంగా అలంకరించారు. అభిషేకాలు, కుంకుమ పూజలు జరిగాయి. భక్తులు అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

జూదరుల అరెస్ట్

గిద్దలూరు రూరల్: మండలంలోని వెంకటాపురం గ్రామంలో పేకాట ఆడుతున్న 10 మందిని స్థానిక సీఐ వైపీ సోమయ్య ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. పేకాట ఆడుతున్నారని సమాచారం అదడంతో సీఐ తన సిబ్బందితో సహా సంఘటనా స్థలం వద్దకు చేరుకుని పేకాట ఆడుతున్న వారిని అదుపులోకి తీసుకుని వారి వద్ద ఉన్న రూ.10,800 స్వాధీనం చేసుకున్నారు.

ఐదుగురు జూదరులు

కొమరోలు: మండలంలోని తాటిచెర్ల సమీపంలోని పొలాల్లో ఆదివారం స్థానిక ఎస్సై మధుసూదన్‌రావు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది పేకాట శిబిరంపై దాడి నిర్వహించారు. పేకాట ఆడుతున్న 5 గురు వ్యక్తులను అరెస్టు చేసి 320 రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మధుసూదన్‌రావు మాట్లాడుతూ పట్టణంలో ఎవరైనా చట్టవ్యతిరేకమైన కార్యకలాపాలకు పాల్పడితే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

